"మనిషి జీవితంలో ఎప్పుడు పతనానికి స్వాగతం పలుకుతాడో చెప్పలేం" అన్నాడు రామం.

నేనూ-నాయుడూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాం, రోజూ సాయంకాలం పూసుపోక నాగావళీ నది ఒడ్డున ఇసుకలో కూర్చుంటాం.



రాజస్థాన్ వాడి కారప్పూస కొనుక్కుని పొట్లాలు ముందేసుకుని మాట్లాడుకుంటూ ఉన్నాం. రామం ఎప్పుడూ యింతే. ఏదీ వివరంగా చెప్పడు. చెప్పేముందు ఒక సుభాషితమో, తత్వమో ఒకటి వొదుల్తాడు. తర్వాత అసలు విషయం ప్రారంభిస్తాడు. అందువలన ఏం జరిగిందీ ప్రశ్న వెయ్యలేదు, మేము.

"అనుమానానికి ఒక అర్థం వుండాలి, ఆధారాలు వుండాలి, అవన్నీ లేకుండా ఏదో మనస్సులో పెట్టుకుని, ఐదేళ్లగా కాపురంచేసిన భార్యను, పనసపండులాంటి బిడ్డల్ని వదిలెయ్యడం చాలా దారుణం" అన్నాడు పొట్లాం విప్పుతూ.

"ఇది మామూలేగా ప్రతీ జాతుల్లోనూ

సాధారణంగా జరుగుతోంది కదా'' అన్నాడు నాయుడు.

''అవును మామూలే. అటవిక జాతుల్లోనూ, సంస్కారం లేని మనుష్యుల్లోనూ ఇది తప్పనిసరిగా కన్పిస్తుంది. కానీ చదువుకున్నవాడూ, సంస్కారం కలవాడూ, ఉన్నత వంశ సంజాతుడు న్యాయశాస్త్రం చదువుకున్నవాడు అలాంటి పని చేస్తే ఏం చేస్తారు?'' అన్నాడు.

''ఏం చేస్తాం? వాడి ఖర్మ అని వదిలేస్తాం'' అన్నాడు నాయుడు గోల్డుఫ్లేకు సిగరెట్టు వెలిగించుకుంటూ. వాడిది శ్రీకూర్మం. అయినా ఎప్పుడూ శ్రీకాకుళంలో ఉడిపి లాడ్జింగులో వాడికో గది వుంటుంది. పట్నవాస జీవితమంటే వాడికో మోజు. రాజకీయంగా ఒక స్థానం సంపాదించాలన్న తపన వున్నవాడు. నిస్పృహాయంగా నావేపు చూశాడు రామం.

''ఇంతకీ ఆ ఉత్తముడి పేరు చెబుదూ, వెధవ సస్పెన్సుతో చంపక'' అన్నాను కొంచెం కోపంగా.

''ఎవరో ఏమిటి? మా పక్కింటి మనోహరుడే'' అన్నాడు రామం.

మనోహరం బి. ఎ. బి. యల్. మంచి ప్రాక్టీసువున్న లాయరు. అతను రామం ద్వారా, నాయుడు ద్వారా నాకు బాగా తెలుసు. నాయుడు వాళ్ల నాన్న అతని క్లయింట్సు. రామం వాళ్ళ పక్కింటి మేడ వాళ్లది. ప్రాక్టీసులో ఆర్జించి క్రొత్తగా 'ఎంబాసిడర్' కారు కొన్నాడు. ముగ్గురన్నదమ్ములు, పెద్ద వుద్యోగాలు చేస్తున్నారు. తల్లిదండ్రులు పెద్దన్నయ్య దగ్గరే ఉంటున్నారు. మనోహరమే ఆఖరివాడు. మా కన్నా ఒకటి రెండు సంవత్సరాలు పెద్దవాడనుకుంటాను. ఒకటి రెండుసార్లు సాయంకాలం అతనితో సరదాగా మాట్లాడుకున్నాం. ఎన్నో విషయాలు అతనికి తెలుసు. గొప్ప మేధావిలా కనిపిస్తాడు.

నేను మొదట నమ్మలేక పోయాను. సాయం సంధ్యలో నా ముఖంలో రంగులు చూసాడువాడు.

''నే చెప్పినది నిజమేరా! అంత కుసంస్కారి అని మేమూ అనుకోలేదు. మా పెరట్లో పిట్టగోడ ఒకటివుంది కదా, ఆ అమ్మాయి వచ్చిన తరువాత గోడ పెంచేసాడు. అలా ఎందుకు చేసాడో ఇప్పుడిప్పుడర్థమవుతోంది'' అన్నాడు రామం బాధగా. రామం వాళ్లది పెద్ద కుటుంబం. వాళ్లు మంచి సంస్కారవంతులు. రామం కో పెద్ద బటల కొట్టు వుంది.

''అసలింతకీ సంగతేమిట్రా?'' అన్నాను. 'ఒదిలేశాడు' అన్నదానికి కారణం వొకటి వుండాలి కదా మరి, నాకూ చాల బాధవేసింది.

ఎప్పుడో ఒకసారి మురళీ హాల్లో చూశాను. కార్లో వచ్చారు. ఆ దంపతులు. ఇద్దరు పనసపండుల్లాంటి బిడ్డలు. ఆమె తమలపాకు రంగుచీరలో మెరిసిపోతున్న స్వర్ణ ప్రతిమలా వుంది. వాస్తవానికి కాకి ముక్కుకు దొండపండులా అమరింది. నయాపైసాకు కొంచెం పెద్దదయిన బొట్టులో మరీ అందంగా వుందామె. ఆమె ముఖాన్ని బట్టి చాలా అమాయకంగా అవుపించింది.

''ఏవుంది? జిహ్వా కో రుచి పుర్రె కో

బుద్ధి'' అన్నాడు రామం. మళ్లా మరో సిగరెట్టు వెలిగించాడు.

"అది కాదురా! ఆమె ఎవ్వరితోనో వుంటోందని వాడి అనుమానం."అన్నాడు.

''అది ఎలాగ సాధ్యం.''

''సాధ్యం కానిది కాబట్టే వాడికి నింద వేసి వదిలేయడానికి సాధ్యమయ్యింది. ఇంతకాలంగా వుంటున్నా ఆమెను నేను చాలా తక్కువసార్లు చూసాను. అసలు వాడి వాదనేమిటంటే వాడొకనాడు కోర్టు నుండి ఇంటికి వచ్చేసరికి అతని భార్య, ఆమె అక్కగారి భర్తగారు ఎదురెదురుగా కాఫీ త్రాగుతూ నవ్వుకుంటున్నారట. అదీ అసలు కారణం.'' అన్నాడు.

''ఈ మాత్రం దానికే! నలుగురు బలగం వున్నవాళ్ళు, బావలు, మేనమామలు, మేనబావలు వస్తే సరదాగా మాట్లాడు కోవటం కూడా తప్పయితే, మనం మన భార్యల్ని ఏనాడో పుట్టింట్లో వొదిలేయాలి'' అన్నాను బాధగా.

నాయుడేం మాట్లాడటంలేదు. పిడికిటిలో ఇసుక తీసుకుని గాలిలో రేణువుల్ని నెమ్మదిగా జారవిడుస్తున్నాడు. చీకటి కరిగి చల్లబడిన కస్తూరి నెయ్యిలా పేరుకుంటోంది.

''ఆ బావ గూడా వయస్సులో వున్న వాడు కాదు. రెండు మూడు సంవత్సరాల్లో రిటైరై పోతాడు'' అన్నాడు.

''అయితే ఇప్పు డెక్కడున్నార్రా!'' అనడిగాను. నా మస్తిష్కంలో ఆమె పిల్లలు మెదుల్తున్నారు.

''వాడింటికి చాలామంది పెద్దలు వచ్చారు. ఆ అమ్మాయి నాన్న అమ్మ, తదితర బంధువులు, తర్వాత ఆమె బావగారూ వచ్చారు. 'నా కూతురు లాంటిది నాయనా ఆ పిల్ల' అని తన పిల్లల మీద ప్రమాణం చేసి చెప్పాడు పాపం. కానీ ఆ దరిద్రుడు నమ్మలేదు. వాడి మొఖాన ఏడుస్తూ ఆ పిల్ల తల్లిదండ్రులు, ఆమెను తీసుకెళ్ళిపోయారు.' అన్నాడు.

నా గుండెలు బరువెక్కాయి. ఆమె భవిష్యత్తు మీద, పిల్లల భవిష్యత్తుమీద. అలాంటి దైన్య స్థితి నా చెల్లెలుకే సంభవిస్తే ..

''ఇప్పుడా పిల్లగతి ఎలాగ? స్వగతంలోని మాట బయటికి వచ్చేసింది.

''ఏముంది? విడాకుల వ్యవహారం కోర్టులో నడుస్తోంది.'' అన్నాడు రామం.

ముగ్గురం లేచాం. సెంటరు వద్దకు



వచ్చేసరికి నాయుడు పాత ఖాతా రిక్షావచ్చి దండం పెట్టింది.

"ఏంటిరా సంగతి?" కళ్ళెగరేశాడు నాయుడు.

"కొత్త సరుకు వొచ్చింది బాబూ! కాకి వీధిలోవుంది" అన్నాడు. కొంచెం నెమ్మదిగా మా ఇద్దరికి మాత్రమే వినిపించింది.

నాయుడి జీవన సిద్ధాంతం మాకు తెలుసు. ప్రపంచంలో అందినంత అందాన్ని ఎలాగయినా ఆస్వాదించడానికి ప్రయత్నించటమే వాడి లక్ష్యం.

"వస్తానర్రా" అంటూ రిక్షా ఎక్కి వెళ్ళిపోయాడు.

"వీడికి బుద్ధి మారదా?" అన్నాను.

"ఎలా మారుతుంది? వీళ్ళకి చచ్చినంత డబ్బు మూలుగుతోంది. వాళ్ల నాన్న వ్యవసాయం, బుర్రతిప్పుడు వ్యవహారం, వీడు డబ్బు నీళ్లలా ఖర్చుపెట్టినా రెండు తరాల దాకా వస్తుంది" అన్నాడు.

ఇంటికి వెళ్ళినతరువాత నాకు నిద్దుర పట్టలేదు. స్త్రీలకు పురుషులతో సమానమైన హక్కులు కావాలని ఘోషిస్తున్న ఈ యుగంలో పురుషుడు వ్యభిచారం చేస్తే తప్పులేదు. కానీ స్త్రీ వ్యభిచరించ గూడదు అన్న సిద్ధాంతం జ్ఞాపకం వచ్చింది. ఈ మనోహరం అనే పురుగుమీద కధ రాయాలనుకున్నాను. కానీ రామం దగ్గర ఇంకా కొంత ముడిసరుకు తీసుకోవాలి.

* * *

ఉదయాన్నే రామం మేడదగ్గరకు వెళ్లేసరికి మనోహరం పోర్టికోలో నిలబడి క్రొత్త కారును పని కుర్రాడిచేత తుడిపిస్తున్నాడు. నన్ను చూడగానే విష్ చేసాడు. కొంచెం గడ్డం పెంచాడు. స్నానంచేసి, వెంకటరమణమూర్తి గంధం నయాపైసా అంత పెట్టి మధ్య ఎర్ర కుంకుమ బొట్టు పెట్టుకున్నాడు. మెడలో రుద్రాక్షలు వున్నాయి. సినీమాలో మేకప్ చేసికొన్న మాంత్రికుడులా వున్నాడు. నేను వెళ్ళక తప్పింది కాదు.

"ఏమిటి సార్?" అన్నాను. ఆ ప్రశ్నలో ఏమిటీ వింత వేషం అన్న ఆశ్చర్యార్ధకం వుంది.

భుజంమీద చెయ్యివేసి డ్రాయింగు రూం దగ్గరకున్న బెడ్‌రూంలోకి తీసి కెళ్లాడు.

అతని ఆప్యాయతకు నాకే ఆశ్చర్యం వేసింది. డబుల్ డన్‌లప్ బెడ్‌మీద కొన్ని వేదాంత గ్రంథాలు వున్నాయి. జాతక మార్తాండం, తదితర తాళపత్ర గ్రంథాలు వున్నాయి. మధ్యగా తెల్లకాగితాలు స్కేలు, పెన్సిలు వున్నాయి. ఒక ప్రక్కగా అర చేయి అద్ది నలుపు చేసిన కాగితాలు, అవి గాలికి ఎగిరిపోకుండా ఇత్తడి చట్టంలో బిగించిన పెద్ద భూతద్దం పెట్టబడివున్నాయి.

"ఏంటి సార్! జాతకాలు గూడా చూడ్డం మీకు వచ్చా" అన్నాను ఆశ్చర్యంగా. ఎంత మనస్సులో మనిషి మీద అసహ్యం వున్నా సభ్యత కొంచెం పాటించాలి గదా మరి.

"ఆ! ఏదో కొంచెం నేర్చుకున్నాను. మీ కిందులో ఏమైనా ప్రవేశం వుందా?" అనడిగాడు, అతను. నాకు రాదని తలూపాను.

"అదేంటి సార్! మీరు బ్రాహ్మణులు

ఆందులో వైదికులు కదా ..'' అన్నాడు

''మేడిపండు వాటం సార్ నాలో బ్రాహ్మణ్యంతో కూడిన సంస్కారం. అదీ గాక నాకందులో నమ్మకంలేదు.'' అన్నాను వ్యంగ్యంగా.

''అలా కొట్టి పారేయకండి సార్. మీలాగే నాకూ పూర్వం నమ్మకంలేదు. కానీ ఇటీవల నా జీవితంలో సంఘటనల వల్ల నేను నమ్మక తప్పలేదు.'' అన్నాడతను.

తర్వాత మనోహరం ప్రారంభించాడు. గ్రహాలు, వాటి స్థాన చలనాలు, ఉచ్ఛ నీచాలు, తన జీవితంలో ఎలా పరిభ్రమించి ఎలాంటి ఫలితాల్ని ఇచ్చినదీ చెప్పుకు పోతున్నాడు. నాకేం బోధపడలేదు అతని వాగ్ధోరణి. పైగా ఆశ్చర్యం వేసింది. ఇవన్నీ ఎప్పుడు నేర్చుకున్నాడని. ఆ మాటే అన్నాను.

''నేనూ నేర్చుకోక పోదును శాస్త్రి గారూ! ఈమధ్య జీవితంలో నేనొక పెద్ద దెబ్బ తిన్నాను'' అన్నాడు ఉపోద్ఘాతం ప్రారంభిస్తూ క్షణం సేపు మా ఇద్దరి మధ్య నిశ్శబ్దం రాజ్యం చేసింది. అతను కళ్ళు మూసుకున్నాడు. కళ్లు విప్పకుండానే,

''నా భార్య నా ఇంట్లోనే వ్యభిచారం సాగిస్తున్నది. అది భరించలేక పోయాను. ఏదో భగవంతు డిచ్చిన ఆస్తి వుంది. మీ అందరి అభిమానంవల్ల ప్రాక్టీసు బాగా పెరిగింది. ఇద్దరు పిల్లలు నాకేం అని గర్వించాను. కానీ చివరకు నేను ఇంత భవంతిలోనూ ఒక్కడినే ఒంటరిగా మిగిలి పోయాను'' అన్నాడు,భార్యను ఒదిలేశాను. అన్న ధ్వని ఆ మాటల్లో ప్రతి ధ్వనిస్తూ. ఎంతయినా ప్లీడరు, పేచీల బుర్రకదా మరి.

నేను కళ్ళతోనే సానుభూతి ప్రకటించాను.

''అప్పట్నుంచీ నాకీ బాధ పట్టుకుంది. నా జీవితంలో ఎందుకీ ఘటన జరిగిందీ అని పరిశోధిస్తున్నాను. అసలలా ఎందుకు జరిగిందంటారు?'' అతని ప్రశ్న.

నేనేం మాట్లాడలేక పోయాను.

''నేను నా భార్యను ఎంతో ప్రేమించాను. ఆమె నా జీవితంలో నిప్పులు పోసింది. ఆమెకు పెళ్ళికాకముందే ఏవో సంబంధాలు వున్నాయట. ఆ తర్వాత ఇక్కడ నా క్లయింటుతోనే వ్యభిచారం సాగించింది'' అన్నాడు బాధగా.

అతని బాధను చూసి నాకు నిజంగా జాలి వేసింది. కడివెడు పాలల్లో ఒక మజ్జిగ చుక్కలా అయిపోయిందతని జీవితానికి.

''ఇప్పుడు నాడీశాస్త్రం పరిశోధిస్తున్నాను. పరిశీలిస్తున్నాను. అది పూర్తయి పోయిన తరువాత మీరు నాకో సాయంచేసి పెట్టాలి '' అన్నాడతను ప్రాధేయ పూర్వకంగా నా కళ్ళలోకి చూస్తూ.

''ఏమిటి చెప్పండి'' అన్నాను.

''ఏంలేదు. మీరు రచయితలు కదా! నా జీవిత చరిత్రను రాసిపెట్టాలి. అయితే అది పూర్తిగా జీవిత చరిత్ర కాకూడదు. ఒక సందేశాత్మక నవలలా వుండాలి. భార్యలను గుడ్డిగా నమ్మే భర్తలకు ఒక మార్గదర్శి కావాలి.'' అన్నాడు దృఢంగా.

''చూదాం లేండి సార్'' అన్నాను.

''అమ్మమ్మ! అలాగనకండి. నా ప్రయి

వేటు విషయాల్ని మీకు తప్ప మరెవ్వరికీ చెప్పి రాయించలేను. అందువలన మీరు తప్పకుండా ఈ సాయం చెయ్యాలి.'' అన్నాడు నా చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

ఇంతలో ఎవరో క్లయింటు రావడం వల్ల మా సంభాషణ కంతరాయం కలిగింది. నేను వచ్చేసాను.

*　　*　　*

'' ఇదిరా సంగతి'' అన్నాను. మనోహరానికీ నాకూ జరిగిన కథ చెప్పి. మామ్మూలుగానే ముగ్గురం ఇసుకలో కూర్చున్నాం.

''ఒరేయ్ నమ్మకురా. ఆమెకి ఇల్లు, పిల్లలు, సంసారం తప్ప మరొక ధ్యాస వుండేదికాదు. ఆమె గురించి చెప్పినవాడికీ, విన్నవాడికీ కళ్ళు పోతాయి'' అన్నాడు రామం కోపంగా.

''ఆమె తన క్లయింటుతో వ్యభిచారం సాగించినట్లు దాఖలాలు కొన్ని చెప్పాడు'' అన్నాను నేను. రామం మీద నాకు కోపం వచ్చింది. ఏక పక్షమే వాదిస్తున్నాడు వాడు. నిజానిజాలు యెవరికి తెలుసు.

''అబద్ధం'' అరిచాడు రామం నిస్సహాయంగా. ఆ శబ్దం గాలిలో కలిసిపోయింది. మళ్ళా అంతలోనే తేరుకుని.

''నాయుడుగూడా రెండు మూడు సంవత్సరాల నుండీ అతని క్లయింటు గదా! చెప్పమనరా వాడ్ని.ఆమె ఎలాంటిమనిషో'' అన్నాడు రామం నాయుడి వేపు చూసి.

''ఆమె చాలా ఉత్తమురాలని విన్నానురా! వాస్తవానికి పిల్లల్ని తప్ప నేను యెవ్వర్నీ చూడలేదు'' అన్నాడు.

''మరి అలాంటప్పుడు ఎందుకు అలాంటి పాపానికీ ఒడిగట్టావ్?'' అన్నాడు రామం బాధగా. నా కాశ్చర్యం వేసింది.

అసలు నాయుడుగూడా దక్షిణ నాయకుడే. మనోహరం భార్యతో నాయుడుకు సంబంధం వుందా' రామం ప్రశ్న నన్ను తికమక పెట్టింది. ఆలోచనల్ల రంపంపొట్టు రాల్చింది.

''నీకూ ఈ సంగతి తెలిసిందా?'' అన్నాడు నాయుడు దొంగ దొరికినట్లుగా దొరికిపోయి.

''ఎందుకు తెలియదురా! నీ అంతట నీవు చెప్పకపోయినా కనీసం నీవు కోర్టులో సాక్ష్యం ఇచ్చినపుడు విన్న ప్లీడర్లు, జనం ద్వారా నాకు తెలియ దనుకొంటున్నావా'' అన్నాడు రామం.

''ఏమిట్రా అది!'' అన్నాను ఆత్రతగా

''ఈ ప్రబుద్ధుడు మనోహరంగాడు పెట్టుకున్న డైవోర్సు దావాలో వాడిభార్యకు, వీడికి సంబంధం వున్నదని కోర్టులో సాక్ష్యం చెప్పాడు'' అన్నాడు రామం బాధగా.

నాకు వాస్తవానికి నాయుడ్ని తందా మనిపించింది, కానీ స్నేహితుడు.

''ఒరేయ్ ఇలాంటి సంఘటనలే నీ చెల్లెలికి జరిగితే ఏంచేస్తావురా?'' అనడిగాను.

కొన్ని కొన్ని ఎదుటివాళ్ళ అనుభవాలు తన పక్షంగా ఆలోచించుకోవటం మంచిది.

నాయుడేం మాట్లాడలేక పోయాడు. ఆవరిస్తున్న చీకట్లో వాడి ముఖ కవళికలు గుర్తించటానికి అవకాశంలేదు.

ట్వింకిల్ ట్వింకిల్ ఫిల్మ్‌స్టార్!

అడుగుజాడలు కృష్ణవి అవిభావికి బాట
అలాగని కాదెన్నటికీ ఇద్దరిదీ చెరోమాట
నటనలో ఆమె కెన్నో కలికి తురాయిలున్నా
స్వదర్శకత్వంలో తయారయిన మీనాయే
అన్నింట మిన్న
ఆమె పేరులో ఉన్న మొదటి మూడక్షరాలు
నిర్మల అజేయురాలని చెప్పటానికి అవుతాయి
సాక్ష్యాలు.

—జి. ఎన్. సూరి.

"ఒరేయ్ నాయుడూ! మనం చదువుకున్నవాళ్ళం. ఈ తరానికి ప్రతినిధులం. ఇంతో అంతో మానవత్వం ఉన్నవాళ్ళం. ఏ పనయినా ఆలోచించి చెయ్యాలి న్యాయం కోసం, ధర్మంకోసం పోట్లాడక పోయినా కనీసం అధర్మం, అన్యాయం జరగకుండా చూడాలి" అన్నాడు రామం. నాయుడి మీద వాడికింకా కోపంపోలేదు వాడి మాటల్లో బాధ మాత్రం ప్రతిధ్వనిస్తున్నది.

"మీకు తెలియదురా నేనెటువంటి పరిస్థితుల్లో సాక్ష్యం చెప్పాల్సి వచ్చిందో! విలేజ్ పాలిటిక్సులో మేం వేసిన సివిల్ క్రిమినల్ దావాలన్నీ వాడిదగ్గరే వున్నాయి. నేను మొదట ఒప్పుకోకపోతే మా నాన్నగారి ద్వారా ఒత్తిడి తెచ్చి, అంగీకరింపజేశాడు. వాడో గుంట జిత్తుల నక్కరా. నా పాపానికి విష్కృతి లేదురా!" అన్నాడు బాధగా.

"సరేలే ఎవరి జీవన పరిణామానికి ఎవరు బాధ్యులు" అన్న రామంమాటలతో సంభాషణ ముగిస్తూ, గుడ్‌నైట్ చెప్పుకొని ఎవరి గూళ్ళకు వాళ్ళం చేరిపోయాం.

* * *

కొంచెం వర్షం పడుతున్నాది.

హోటల్ రూం కిటికీలోనుండి చూస్తే కరెంట్ కొరతవల్ల లైట్లులేక నల్లటి తార్పాలిన్ కప్పుకున్నాయి వీధులన్నీ. ఆ రోజు నాయుడు పార్టీ ఇస్తున్నాడు రూంలో. స్కాచ్ విస్కీ కళింగపట్నం నుండి తెచ్చాడు.

గాలిలోకి మూడు గ్లాసులు లేచాయి. చీర్స్ చెప్పుకున్నాయి. గది వెచ్చగావుంది. మధువు శరీరాన్ని వేడెక్కిస్తున్నాది.

"ఎంతవరకూ వచ్చింది మనోహరం గాడి డైవోర్సు" అనడిగాడు నాయుడ్ని, రామం.

"ఇంకా ఆర్గ్యుమెంట్సు కావాలి" అన్నాడు.

మనోహరం అంటే నాకు జ్ఞాపకం వచ్చింది.

"ఒరేయ్ వాడు ఎవర్తెనో వెంటేసుకొని కార్లో వైజాగ్ వేపు వెళ్తూ కనిపించాడురా. గెడ్డం గట్రా ఏమీ లేవు. మీసాలు మాత్రం వున్నాయి" అన్నాను.

"ఎవర్తినో తీసుకుని వెళ్తున్నాడూ. అవునుమరి ఎంతకని వుండగలడు బ్రహ్మచారిగా" అన్నాడు రామం. వాడికి మనో

హారంమీద గొప్ప కోపం. కొంచమయినా సింపతీ లేదు.

"ఎవర్తో కాదురా! అది వాడికి కాబోయే పెళ్ళాం" అన్నాడు నాయుడు.

మా ఇద్దరి నోటమ్మంట మాటరాలేదు. ఆ పిల్లను గురించి కొన్ని విషయాలు మనోహరం గాడు చెప్పివుంటాడను కున్నాం.

"వివరాలు చెప్పరా" అన్నాను ఆతృతగా.

రెండోరౌండుకు గ్లాసులో విస్కీ-పోసి సోడావాటర్ కలిపాడు. అయిసుముక్కలు గ్లాసులోకి జారవిడుస్తూ.

"ఏం చెప్పమంటావురా వాడి సంగతి. ఈ రోజు ఉదయం వెళ్లాను. కోర్టు వాయిదాలు తెలిసికోవడానికి. గుమ్మాలన్నీ కొత్త తెరలు కట్టబడివున్నాయి. ఎప్పుడూ మ్రోగని రేడియో వాళ్లింట్లో శ్రీలంక సంగీతం పాడుతోంది మనోహరాన్ని కేకేశాను. గది గుమ్మం తెర తొలగింది గాజుల చప్పుడు వినిపించింది. నేను తలెత్తి చూశాను అంతే మెరపులా మాయమయ్యింది. ఎక్కడో చూసాను ఆమెని కొన్ని క్షణాల్లో మనోహరం వచ్చాడు కొత్తపెళ్ళికొడుకులా వున్నాడు హుషారుగా డ్రాయింగురూంలో కూర్చున్నాం ఇంతలో ఆమె రెండు కప్పుల కాఫీ తీసుకువచ్చింది కాబోయే భార్యగా ఆమెను పరిచయం చేశాడు. నాకు తల తిరిగిపోయింది ఆమెను ఎక్కడో చూసాను. ఆమె క్షణంసేపు నిలబడి నా వంక దొంగతనంగా చిరునవ్వునవ్వి వెళ్లిపోయింది." అన్నాడు గ్లాసులో విస్కీ సిప్ చేస్తూ.

"ఎవర్రా ఆమె? మీ బంధువా?" ప్రశ్నించాను, ఆతృతగా.

"బంధువూ కాదూ, పాడూ కాదూ, ఒకప్పుడు టెక్కలిలో, పలసాలో మహా జనానికి మరదలు పిల్లరా! నేనామె పాత ఖాతాదారుణ్ని సోంపేటలో. ఇది వీణ్ణి ఎలాగ ఆకర్షించిందో నా కర్థం కాలేదు. పైగా ఆ మనోహరంగాడు. దాన్నిగురించి 'ప్రశంసిస్తూ' 'ఏ పూర్వ పుణ్యఫలమో నాయుడూ దెబ్బతిన్న నా జీవితాన్కి అలాంటి అమ్మాయి లభించటం' అంటూ ఒకటే యిది. వాడి మాటలు వింటే నాకు ఒంటిమీద జెర్రులు ప్రాకాయి"

"పోనీ మనం 'ఆ అమ్మాయి బజారు మనిషి నీ వెధవ తెలివి ఏడిసింది' అని ఆకాశరామన్న ఉత్తరంరాస్తే." "రామం గొప్ప అయిడియా వెలిబుచ్చినట్లుగా ఫోజు పెట్టాడు.

'దానివల్ల వాడొదిలేసిన అమ్మాయి జీవితం బాగుపడమురా" అన్నాను.

"నిజమేరా! వాడొక డాక్టరు దగ్గర కెళ్ళి తను శారీరకంగా సంసారం చెయ్యడానికి అనర్హుడనని సర్టిఫికేటు అడిగాడు. కానీ మానవత్వం గల డాక్టరు కోపంతో వాడికి గెట్ అవుట్ చెప్పాడు" నాయుడు.

"చూడరా వాడెంత ప్లాను వేశాడో.

ఆలా సర్టిఫికేటు సంపాదిస్తే తన పిల్లలు, తన పిల్లలు కారని, వేరే యెవరికో పుట్టారని భార్యమీద నిందవేసి విడాకులు సంపాదించాలని ఆశించాడు'' అన్నాడు రామం బాధగా.

నాకు వొళ్లు గగుర్పొడిచింది. అనాగరిక జాతులు గూడా చేసుకోలేని ఆత్మవంచన అతనిది.

''ఒరేయ్ మనోహరంగాడి జీవితంలో ఒక రకమైన హిస్టీరియాలాంటి పురుగు ప్రవేశించింది. అది శరీరంలో నుండే కండరాలనే కాకుండా మనస్సును గూడా తినేస్తుంది. అంతస్థుతో, డబ్బుతో, మందులతో దాన్ని బాగుచేసుకోలేం. అది బాగుపడడానికి మానసిక సంస్కారం కావాలి. మనోహరంలాంటి చెదపురుగు, తన స్వార్థంకోసం ఏమైనా చేస్తాడు. దానికి అనుమానం అనే నిచ్చెనను ఆధారం చేసుకుంటాడు. ఇలాంటి వాడికి సాంఘిక బహిష్కరణ జరగాలి. వాడు చేసిన పాపానికి వాడు తవ్వుకున్న గోతి లోపలి కాలమే వాడిని సర్వనాశనం చేస్తుంది వాడొక చెదపురుగు వాడి చరిత్ర '' విస్కీ కిక్కు యిచ్చింది. సమంగా మాట్లాడలేక పోయాడు

నాకా రోజు మనోహరం చేసిన రిక్వెస్టు జ్ఞాపకం వచ్చింది.

''అవును సమాజానికి మనోహరం లాంటి చెదపురుగు చరిత్రను చాటి చెప్పే కథను రాయాలి'' అనుకున్నాను వేదనగా. పార్టీ అయిపోయి, యింటికి వెళ్లడానికి రిక్షా ఎక్కుతూ. ★

శ్రీ బాలాజీ వైద్యశాల

డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడీ గుడివద్ద ఫోన్ : 551, తెనాలి (ఏ.పి.)

బ్రాంచి : 9-D, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

దీర్ఘ రోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోసుతో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నములు, కుష్ఠు - బొల్లి, చర్మ వ్యాధులు హెర్నియా (గిలక), పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం, దగ్గులకు ఉచిత వైద్యం. రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండ బాగు చేయబడును, స్వయంగా వచ్చి సంప్రదించవలెను.